# నిత్యజీవమును గూర్చిన సత్యము

**పాఠ్యోద్దేశం:** దేవుని గూర్చిన సత్యమును మానవుని గూర్చిన సత్యముతో సంబంధింప జేసి తద్వారా జీవమును నిర్వచించుట.

## ఉపోద్ఘాతము

క్రైస్తవులు కొన్ని మారులు వారు వివరింపలేని బైబిలు పదములను ఉపయోగించెదరు. వాటిలో ఒకటి "జీవము" అను పదము. మనము కేవలము ప్రాణమే గాక నిత్యజీవమును కలిగియున్నామని నిశ్చయముగా ఎరుగుదము. అయితే, మనలో చాలా మందికి మనము కలిగియున్నామని చెప్పుకొనుచున్న దానినే వివరించుట కష్టతరమగుచున్నది. గ్రీకు పదములైన "జోయే" (ZOE) మరియు "సూకే" (PSUCHE) అనునవి జీవమని, ప్రాణమని క్రొత్త నిబంధనలో తర్జుమా చేయబడినవి. యెహాను 10:10,11లో ఈ రెండు మాటలను కనుగొనగలము. "గొఱ్ఱెలకు జీవము (ZOE) కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును వచ్చితి" ననియు "మంచి గొఱ్ఱెలకాపరి తన గొఱ్ఱెల కొరకు ప్రాణము (PSUCHE) పెట్టును" అనియు యేసు చెప్పెను. డబ్ల్యు. ఇ. వైన్ అనునతడు, తన నిఘంటువు (Expository Dictionary of New Testament Words) లో ఈ క్రిందివిధముగా పరిశీలన చేసెను. "సామన్యముగా చెప్పిన యెడల, సూకే (PSUCHE) అనునది వ్యక్తిగత ప్రాణము, జీవించు ప్రాణి అయితే, జోయే (ZOE) అనునది జీవించు ప్రాణి యొక్క జీవము". కీర్తనలు 66:9 లో దేవుడు.... జీవ (ZOE) ప్రాప్తులనుగా మమ్ము (PSUCHE) ను కలుగుజేయువాడు. అతడింకనూ చెప్పుచూ. "జోయే (ZOE) అనగా ఒక నియమబద్ధమైన జీవము. పరిపూర్ణ జీవము, దేవుడు కలిగియుండిన రీతిలోని జీవము. అయితే, సూకే (PSUCHE) అనునది మత్తయి 2:20 లో వ్రాయబడిన దాని వంటి ప్రకృతి సంబంధమైన భౌతిక ప్రాణము" అనెను. ఈ రెండు పదములు అన్ని మారులును అవే అర్థములునిచ్చునట్లు వాడబడలేదు. అయినను, సామన్యముగా అదే రీతిలో చెప్పబడియున్నది.

"నిత్య" అను విశేషణము, 1 యోహాను 1:2 లో "ఎయినోయిస్' అను గ్రీకు పదము నుండి తర్జుమా చేయబడినది. యుగాంతము వరకు నిలిచియుండు నట్టిద"ని అర్థము. అనగా కాలము, భూమి అంతమైపోయినను యింకనూ ఉండునట్టిది. యేసు చెప్పిన ప్రకారము జీవము అనగా దేవుని ఎరిగి, అయనతోను ఆయన కుమారినితోను సహవాసము కలిగియుండుటయని అర్థము. (యోహాను 17:3; 1 యోహాను 1:3). కావున, నిత్యజీవమనగా దేవుని యిప్పుడు ఎరిగినవారమై, ఈ యుగాంతము వరకును ఆయనతో సహవాసము కలిగియుండి, ఆ పిమ్మట అదే స్థితిని స్వతంత్రించుకొనుట (తీతు 3:7)

## పాఠము

జీవించు ప్రాణి (సూకే - PSUCHE) గా యేసుక్రీస్తు తన వ్యక్తిత్వములో మానవునికి జీవము (జోయే - ZOE)ను ప్రత్యక్షపరచెను. సత్యదేవుని మన మెరిగియుండి, తద్వారా జీవమును కలిగియుండునట్లు, యేసుయొక్క జీవము మానవులకు వెలుగైయున్నది. (యోహాను 1:4,8; 1 యోహాను 1:2; 5:11,12,20). తండ్రి కుమారులిరువురును తమలో తాము జీవము కలిగి యున్నారు. (యోహాను 5:26). మన రక్షకుడైన యేసుక్రీస్తు, మరణమును నిరర్థకము చేసి సువార్త ద్వారా జీవమును **అక్షయతను** వెలుగులోనికి తెచ్చెను (2 తిమోతి 1:10).

అపొస్తలులును, ఇతరులును భూమి మీద యేసుతో జీవించియుండినందున, "జీవము" తో వ్యక్తిగతమైన సంబధమును కలిగియుండిరి. వాక్యములో వారు మనకు దానిని ప్రచురము చేసియున్నారు. (1 యోహాను 1:3; యెహాను 6:63). ఈ జీవమును ప్రకటించుమని దేవుని దూత యేసు శిష్యులతో చెప్పెను.

> *...మీరు వెళ్ళి దేవాలయములో నిలువబడి ఈ జీవమును గూర్చిన మాటలన్నియు ప్రజలతో చెప్పుడని వారితో అనెను.* *అపొ. కార్య 5:19,20.*

యేసు జీవాధిపతి, జీవమునకుకర్త (అపొ. కార్య 3:15), యేసు మనకు జీవమై యున్నాడు (కొలొస్స. 3:4). దేవుని ఆజ్ఞలు నిత్యజీవమని యేసు బోధించెను (యోహాను 12:50). యేసు జీవనియమములను అనుసరించి జీవించినాడు. ఆయన అవే జీవ నియమములను బోధించెను.

> *"నామాట విని, నన్ను పంపినవాని యందు విశ్వాసముంచినవాడు నిత్యజీవము గలవాడు, వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని క్రీస్తు చెప్పియున్నాడు* *(యోహాను 5:24).*

జీవమును గూర్చిన అజ్ఞానము, పాపముతో కఠినపరచబడిన హృదయము మానవుని దేవుని నుండి వేరు చేయును (ఎఫెసి. 4:18). దేవుడు పరిశుద్ధుడైనందున, పాపితో ఆయన సహవాసము చేయడు. కావున, పాపము మానవునికి మరణమును తెచ్చెను. **ఆత్మీయ మరణము** దేవుని నుండి ఎడబాటు, ఆమీదట హీనమైన నడత నడుచుట లేక అధమాధమ జీవితమును జీవించుట అని వివరించును. జీవములో నుండి వేరు చేయబడినందున ఇది సంభవమౌను (ఎఫెసీ. 2:1-3). బాప్తిస్మమందు యేసు యొక్క రక్తము పాపములను తొలగించి. నూతన జన్మలో క్రీస్తులోని జీవమును మానవులను అనుభవించనీయును (రోమా. 6:4). విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట (రోమా 3:21-26; 5:1,2) అను బోధ ద్వారా ఈ కృప యందు విశ్వాసు లైన క్రైస్తవుల జీవితాలు నిర్వహించబడతాయి. విశ్వాసము ద్వారా మనము వెలుగులో నడుస్తూ ఉండగా యేసు రక్తము మనలను పవిత్రులనుగా చేస్తుంది(1 యోహాను 1:6,7; గలతీ. 3:21,22).

క్రీస్తునందు, క్రైస్తవులు దేవుని గూర్చి నేర్చుకొని ఆయన స్వభావమును పెంపొందించు కొందురు. తండ్రి కుమారులుగా దేవునితో మనము సహవాసము కలిగి యుందము. పరిశుద్ధాత్మ మనతో వుండినందున మనమిది ఎరుగుదుము (1 యోహాను 3:24). పరిశుద్ధాత్ముడు వాక్యము ద్వారా మనలను నడిపించును. మన బ్రతుకు (సూకే - PSUCHE)లలోని ఆత్మ యొక్క ఫలము మనకు జీవము (జోయే - ZOE) నిచ్చును (2 కొరింథీ 3:6; గలతీ 6:8). విశ్వాసము ద్వారా మనము వెలుగులో నడిచిన యెడల, యేసు యొక్క రక్తము మనలను పవిత్రులుగా చేయుచుండును (1 యోహాను 1:6,7; గలతీ. 3.21,22). ఈ పరిస్థితులన్నియు వాస్తవమైతే, వరముగా నీయబడిన జీవమును మనము కలిగియుందము (రోమా. 5:18).

**నీతిమంతులుగా తీర్చబడిన జీవమును** క్రైస్తవులైన మనము అనుభవించినపుడు మరణ నియమమును విసర్జించుచు, జీవసూత్రములను ధరించుకొందము. బైబిలు ప్రకారమైన ఈ విసర్జించు మరియు ధరించు కార్యక్రమము రూపుదాల్చుటకు దయచేసి కొలొస్స. 3:1-17 మరియు ఎఫెసి. 4:17-5.5 ను చదువుము. పరిశుద్ధత అనగా యిదియే. ఇది లేకుండ మనము జీవము కలిగియుండలేము. (హెబ్రీ. 12:24). ఈ ఆత్మీయ పెరుగుదల సమయములోనే మన శీలము, వ్యక్తిత్వము దేవుడు మరియు క్రీస్తు స్వరూపములోనికి మార్పుచెందును. ఈ స్థితి భౌతిక మరణము వరకే. కాని, మృతుల పునరుత్థానమందు ".... మర్త్యమైనది జీవము చేత మ్రింగివేయబడును." (2 కొరింథి. 5:4). క్రైస్తవులు యేసు రెండవమారు వచ్చునంత వరకూ లేక మరణించు వరకూ నిత్య జీవమును స్వతంత్రించుకొనలేరు. విశ్వాసులైన క్రైస్తవులకు యేసు క్రీస్తు ద్వారా దేవుడను గ్రహించు జీవమును గూర్చిన పథకమునకు మృతుల పునరుత్థానము, తీర్పులు అంతిమ ఘట్టములు. అప్పుడు మనము నిత్యజీవమును స్వతంత్రించుకొందము (మత్తయి 19:29).

జీవము అనుదాని యొక్క నిత్య స్థితిని లుకా 20:36 లో "వారికను చావనేరరు" అని యేసు చెప్పిన మాటతో సంక్షేపించవచ్చును. యేసు వెలుగులోనికి తెచ్చిన జీవమును అక్షయత యును ఇదియే, అది వాక్యములో బయలు పరచబడినది అయినను, నిత్యజీవము అనునది "ఎన్నటికిని చావనేరరు" అను దాని కంటెను అత్యధికమయినది ఏలయనగా, "పునరుత్థానములో పాలివారై యుండి, దేవదూతలతో సమానులను, దేవుని కుమారులునై యుందురు" అని యేసు యింకను చెప్పి యుండెను. దేవుని కుమారులుగా నిత్యజీవమును కలిగియుండువారు పరలోకము లోని కార్యక్రమములను అనుభవింతురు.

దేవుని రాజ్యమును గూర్చిన పాఠముల వరుసక్రమములోని మొదటి భాగమందు మనము వ్యక్తపరచిన రీతిని దేవుని గూర్చినట్టియు, మానవుని గూర్చినట్టియు, మరియు నిత్యజీవమును గూర్చినట్టియు సత్యమును మనిమిప్పుడు సంక్షేపించుదము. దేవుని గూర్చిన సత్యమనగా, ఆయన సర్వశక్తిగలవాడు. అధికారము చూపు విషయములో ఆయన సార్వభౌముడు, అంతేకాదు, ఆయన ఒక వ్యక్తి, వ్యక్తిత్వము కలవాడు. తన స్వభావములో ఆయన పరిపూర్ణుడు, అనగా ఆయన మార్పు చెందనివాడు (యాకోబు 1:17). ఆయన మార్పు చెందు విధానములో లేడు. ఆయన ఏమైయున్నాడో అదే ఆయన. ఆయనలో జీవమున్నది. యేసు క్రీస్తు దేవుని స్వభావమును బయలుపరిచెను. క్రీస్తు స్వభావము వాక్యమందు బయలుపరచబడినది.

మానవుడు పరిపూర్ణుడుకాడు. దేవుని కృప లేకుండా అతనిలో జీవము లేకుండినది. దేవుని రాజ్యమునకు వెలుపట నున్నవారందరు తమ అపరాధముల చేతను పాపముల చేతను చచ్చినవారై యున్నారు (ఎఫెసి. 2:1-3).

క్రైస్తవుని జీవము (zoe) క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడియున్నది (కొలొస్స. 3:3). "సత్యసంబంధులు నా మాట విందురు"ని యేసు చెప్పెను. క్రైస్తవులుగా మనము, రాజు అయిన ఆయన స్వరమును విందుము. మనము లోక సంబంధులము కాము. మనము ఆయన రాజ్య పౌరులము (యోహాను 18:36,38). "సత్యసంబంధి" యగుటకు పూర్వమే ఒకడు సత్యమును గ్రహింపవలసియున్నది. మానవుని సృజించుటలో దేవుని యొక్క ఉద్దేశమును గూర్చిన సత్య మేమనగా, క్రీస్తు సారూప్యములోనికి మనము మార్చబడవలెను (రోమా. 8:29). యేసు క్రీస్తు దేవుని కుమారుడు, దేవుని కుమారుడుగా నుండుటయే ఆయన మనకొరకు నిర్వహించు జీవిత పాత్ర. దేవునియందు క్రీస్తుతో కూడా మన జీవము దాచబడినందునను, క్రీస్తు దేవుని కుమారునిగా జీవము కలిగి యున్నందునను, తద్వారా దేవుని కుమారులుగ మనమును జీవము కలిగియున్నాము. దేవుని కుమారులకు క్రీస్తు యొక్క స్వభావము జీవ నియమమైయున్నది (1 యోహాను 2:6). మనము లోక సంబంధులముకాము.

దేవుని రాజ్యమే దేవుని గృహము లేక ఇంటివారు (ఎఫెసి. 2:19). కుమారులు సత్య సంబంధులు అనగా దేవునిని, మానవుల కొరకైన ఆయన సంకల్పమును కను గొనిన వారు.మనలను రూపొందించిన రీతిని మరియు ఆయన మనలను తృప్తిపరచు తన యొక్క విధానమును కూడా మనము కనుగొంటిమి. కొన్ని సహజ కోరికలకు కావలసిన తృప్తిని కలిగియున్నాము. మరియు మరి కొన్ని తృప్తి పరచబడునని మనము నిరీక్షించుచున్నాము. మనము జీవము (జోయే ZOE)ను కలిగియున్నాము. ప్రియులైన పిల్లలవలె మనము దేవుని పోలి నడుచుకొనువారము (ఎఫెసీ. 5:1). దేవుడు ప్రేమై యున్నాడు, ఆ హేతువు చేత, క్రీస్తు వలె మనమును ప్రేమ కలిగి నడుచు కొందము (ఎఫెసీ. 5:2). దేవుని యొక్కయు, క్రీస్తు యొక్కయు, రాజ్యమును మనము స్వతంత్రించుకొనవలసిన వారమై యున్నాము (ఎఫెసీ. 5:5). మనము సంతోషభరితులము.

మానవుని కొరకైన నిత్య జీవమును గూర్చిన సత్యమేమనగా విశ్వాసులైన క్రైస్తవులు దేవుని రాజ్యమును, అందలి జీవమును స్వతంత్రించుకొందురు. స్వతంత్రించుకొనుట అనగా సొంతముగా కలిగియుండుట అని అర్థము. నిత్యమూ దేవుని కుమారులుగ దేవునితో కలిగియుండు జీవమది (1 పేతురు 5:10,11). దేవుడు మన తండ్రియని మనమెరుగుదము. దేవుడు దైవత్వము గల వ్యక్తి. గాన, దేవ స్వభావములో మనము పాలివారమగుదము (1 పేతురు 1:4). ఒక మనుష్యుడు తన స్నేహితుని ఎరిగిన రీతిలో క్రైస్తవులు దేవుని ఎరుగుదురు. ఈ విధముగా మనము దేవుని ఎరుగానివారమైతే, మనము నిత్య జీవము కలిగియున్నామని చెప్పజాలము. ఈ క్రింది లేఖనములో యేసు చెప్పు మాటను గమనించుడి.

“అద్వితీయ సత్యదేవుడైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము”. (యోహాను 17:3).

దేవుని పరలోక రాజ్యపు సంస్కృతియే ఈ జోయే అను జీవము. ఈ జీవమును గూర్చిన స్థితిని జీవ నియమము వివరించును (రోమా 8:2,7). ఒక ప్రత్యేకమైన రీతిలో ఈ సూత్రములు బైబిలులో బయలుపరచబడినవి. అనగా యేసు ప్రవర్తించిన బాటలో చాలామట్టుకు ఈ నియమములు మనకు బయలుపరచబడినవి. మిగిలిన జీవనియమములు యేసు ద్వారాను, పరిశుద్ధాత్మ ద్వారా నడిపింపబడిన ఇతరుల ద్వారానూ. మనకు బోధింపబడినవి. మనము తిరిగి జన్మించిన తరువాతే, ఈ జీవము వాస్తవమగును. అది “క్రీస్తునందు” మాత్రమే సంభవించును.

## చర్చ కోసం ప్రశ్నలు

1. మానవునికి సంబంధించిన రెండు గ్రీకు పదములేవి?
2. ఈ రెండు మాటలలోని భేదమును తెలిసికొనుట ఏల ముఖ్యము?
3. “నిత్య” అను విశేషణము యొక్క అర్థమేమి?
4. యేసు యొక్క జీవము మానవులకు ఎట్లు వెలుగు అగును?
5. దేవుడు జీవమును నేడెట్లు మనకు బయలుపరచును?
6. అపొస్తులుల కార్యములు 3:15 ప్రకారము యేసు మనకు ఎట్లు జీవాధిపతి లేక జీవమునకు కర్త?
7. నిత్యజీవము అనునది పాపము నుండి విడుదల అను దానికంటే ఏలాగు అధికము, వివరించుము?
8. “మర్త్యమైనది జీవము చేత మ్రింగి వేయబడును” అను పదసముచ్ఛయమును వివరింపుము? 2 కొరింథీ. 5:14?
9. యేసు మనకు జీవమెట్లో వివరింపుము. కొలొస్స. 3:3.

10 నిత్య జీవమునకు నీవు చెప్పు నిర్వచనమేమి?

11. దేవుని గూర్చిన సత్యమనగా నేమి?
12. మానవుని గూర్చిన సత్యమనగా నేమి?